క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెంది చిరువ్యాపారి మగ్బుల్ ఏడాది కాలంగా పక్షవాతంతో ఇంటికే పరిమితమవడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బాధితుడ్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, జేసీఎస్ కన్వీనర్ ఆదిశేషయ్య, కౌన్సిలర్లు మొలబండి రాజశేఖర్, పీ పెంచలయ్య, కొప్పోలు వెంకటేశ్వర్లు, సీహెచ్ శ్రీనివాసులు నాయుడు, సయ్యద్ జమీర్ ఉన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుడికి ఆర్థిక సాయం



దుత్తలూరు: కలిగిరి మండలం కుమ్మరకొండూరుకు చెందిన గాదిబోయిన సతీష్‌కు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి బుధవారం రూ.40వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సతీష్‌కు బ్రెయిన్‌స్ట్రోక్‌తో కుడి చేయి, ఎడమకాలు పూర్తిగా పడిపోవడంతో ఏడాదిగా కుటుంబ పోషణ జరగక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నోటి జనార్దన్ రెడ్డి తన దృష్టికి తీసుకురావడంతో ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు.

పాఠశాలలోని ఫ్యాన్ల చోరీ

అనుమసముద్రంపేట: దూబగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పాఠశాలలోని ఓ గదిలో భద్రపరిచిన రూ.1.30 లక్షల విలువైన 28 కొత్త ఫ్యాన్లను దొంగలు అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం గుర్తించిన ఉపాధ్యాయులు ఎంఈఓకు సమాచారం అందజేశారు. ఈ మేరకు ఎంఈఓ–2 సాయిప్రసాద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్‌పేట ఎస్సై ప్రసాద్‌రెడ్డి పోలీసు సిబ్బందిని ఘటనా స్థలానికి పంపి విచారించారు.

వైభవంగా సరస్వతి పూజ



వరికుంటపాడు: వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సరస్వతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు ప్రసాదించాలని సరస్వతీదేవిని వేడుకున్నారు.

రేషన్ సరుకులు సకాలంలో అందజేయాలి



చేజర్ల: రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సమన్వయంతో రేషన్ సరుకులను లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలని తహసీల్దార్ గోపీకృష్ణ సూచించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన వేళల్లో ఇంటింటికి రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎన్నికల కోడ్‌ను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

308 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 308 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 325 బేళ్లు రాగా, 308 బేళ్లను విక్రయించారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.230 ధర పలికింది. వేలంలో 12 కంపెనీలకు చెందిన వ్యాపారప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ఆత్మకూరురూరల్: ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల పరిధిలోని నాలుగు మండలాలను అనుసంధానం చేస్తూ ప్రభుత్వం నూతనంగా రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించిందని పీఆర్ ప్రాజెక్ట్ విభాగం డీఈ సుమన పేర్కొన్నారు. మండలంలోని రామస్వామిపల్లి వద్ద రోడ్డు నిర్మాణ పనులను ఏఈ ఉమామహేశ్వరరావుతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి నుంచి మర్రిపాడు మండలం డీసీపల్లి మీదుగా వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు నూతన రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా వెన్నవాడ–గండ్లవేడు మధ్యన బొగ్గేరుపై నూతన కాజ్‌వే, కిలోమీటర్ దూరం సిమెంట్ రోడ్డు నిర్మిస్తామన్నారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లి దొరస్వామినాయుడు, సుధాకర్, సుబ్బారెడ్డి, తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధిలో ఐదో స్థానంలో రాష్ట్రం



చేయూత నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- వైఎస్సార్ చేయూత సంబరాలు

ఆత్మకూరు: 'అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా వారి స్వయం ఉపాధికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ తోడు, తదితర పథకాల ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నారు. దీంతో రాష్ట్రం స్వయం ఉపాధిలో దేశంలో ఐదో స్థానానికి చేరింది' అని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో కమిషనర్ షేక్ ఫజులుల్లా, మెప్మా సీఎంఎం అంకయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ చేయూత సంబరాలను బుధవారం నిర్వహించారు. తొలుత సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాదుపు మహిళలతో కలిసి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలు చేసి అర్హురాలైన ప్రతి మహిళకు రూ.75వేలు చొప్పున అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం పొదుపు మహిళలను అన్ని విధాలా మోసం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సందర్భంగా 1346 మందికి రూ.2,52,37,500 నగదు నమూనా చెక్కును అందజేశారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించి సీఎం లక్ష్యాన్ని నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి యూనిఫామ్ అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన 22 మంది బాధితులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.31.53 లక్షల చెక్కులను ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదిశేషయ్య, కౌన్సిలర్లు శివకోటారెడ్డి, గంధళ్ల వేణు, రమాదేవి, పీ పెంచలయ్య, స్వరూపరాణి, రాధికారెడ్డి, ఎం రాజశేఖర్, పార్టీ నాయకులు కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, ఆండ్రా వెంకటసుబ్బారెడ్డి, ముజీబ్, చిన్నపరెడ్డి, సయ్యద్ జమీర్, కలాం, కొప్పోలు వెంకటేశ్వర్లు, మెప్మా సీఓ మాధవి, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

సొంత ప్రయోజనాల కోసమే పొత్తులు

చంద్రబాబు అధికారమే పరమావధిగా తన సొంత ప్రయోజనాల కోసం జనసేన, బీజేపీతో పొత్తులు పెట్టుకున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడమే కాకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో 2019 ఎన్నికల్లో చంద్రబాబును ప్రజలు ఓడించారన్నారు. గతంలో ప్రధాని మోదీ, అమిత్‌షాను వ్యక్తిగతంగా విమర్శించిన చంద్రబాబు మళ్లీ అధికారం కోసం కాళ్లబేరానికి పోయి బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నారన్నారు. ఎన్ని పొత్తులు పెట్టుకున్నా టీడీపీ ఓటమి తప్పదని, ఆ పార్టీ తరుపున గెలిచే కొద్ది మంది ఎమ్మెల్యేలు సైతం వేరే దారిలేక బీజేపీలో చేరడం ఖాయమన్నారు. సిద్ధం సభల ద్వారా రాష్ట్ర ప్రజల సంపూర్ణ మద్దతు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్న విషయం రుజువైందన్నారు.

జగన్‌ను మరోసారి సీఎంను చేసుకుందాం



రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

- ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కష్టపడి పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకోవాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. వింజమూరులోని వైఎస్సార్‌సీపీ నేత వనిపెంట సుబ్బారెడ్డి ఇంట్లో బుధవారం నిర్వహించిన పార్టీ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో రాజారెడ్డి మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలు అత్యంత కీలకమని, ఏ మాత్రం చిన్న పొరపాటు జరిగినా రాష్ట్రంలోని పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. జగన్ వెంటే ప్రజలు ఉన్నారని, నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఓట్లు వేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ నేతలు డబ్బుతో ఓటర్లను ప్రలోభపెట్టాలని ప్రయత్నిస్తున్నందున ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తొలుత ఆయనకు వైఎస్సార్‌సీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ బసిరెడ్డి సుమతి, పార్టీ మండల కన్వీనర్ రేవూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు వనిపెంట హైమావతి, భవాని, డేగా వంశీ, సర్పంచ్ సుజన, స్థానిక నేతలు మద్దూరు బాబు, గణపం మాలకొండారెడ్డి, గున్నం ప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మద్దూరు గోపాల్ రెడ్డి, వేమిరెడ్డి రామిరెడ్డి, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ మాళిలామణి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి సంతాపం

ఉదయగిరి: బండగానిపల్లె పంచాయతీ కొత్తపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బసిరెడ్డి బాలిరెడ్డి మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. బాలిరెడ్డి భౌతికకాయాన్ని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకుడ్ని కోల్పోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే విజయీభవ యాత్ర

సోమశిల: అనంతసాగరం మండలం గౌరవరం, కామిరెడ్డిపాడు, మంగుపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవ యాత్రను గురువారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు గౌరవరం, 5 గంటలకు కామిరెడ్డిపాడు, 6.40 గంటలకు మంగుపల్లి గ్రామాల్లో యాత్ర జరుగుతుందని చెప్పారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



అనుమసముద్రంపేట: మండలంలోని గుంపర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సరస్వతి పూజను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు తమకు ఉత్తమ ఫలితాలను ప్రసాదించాలని సరస్వతీదేవిని వేడుకున్నారు. ఈ సందర్భంగా 1999 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు హెచ్ఎం పోతులూరయ్య చేతుల మీదుగా పరీక్ష సామగ్రి అందజేశారు. గ్రామానికి చెందిన కనకమ్మ, మస్తాన్ విద్యార్థులకు పెన్నులు అందజేశారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు



సీతారామపురం(ఉదయగిరి): విద్యుదాఘాతంతో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన సీతారామపురంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన షేక్ నాయబ్‌రసూల్ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడు. అక్కడ సెంట్రింగ్ రాడ్లు వంచుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. బాధితుడిని వెంటనే 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలి



మహిళలతో కలిసి శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: టీడీపీ, అనుబంధ సోషల్ మీడియా ట్రోల్స్‌కు బలైన తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం విజయీభవ యాత్రలో భాగంగా భీమవరంలో పర్యటించిన ఎమ్మెల్యే మేకపాటి స్థానిక మహిళలతో కలిసి గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేని గీతాంజలి తనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందాయని మీడియా ద్వారా తన ఆనందాన్ని పంచుకుందన్నారు. ఈ విషయమై ఆమెను టీడీపీ, దాని అనుబంధ సోషల్ మీడియా ట్రోల్ చేసి అవమానాలకు గురిచేయడంతో ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి కుటుంబానికి రూ.20లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని తెలిపారు. ఆడపిల్లల గౌరవానికి ఎలాంటి భంగం వాటిల్లినా దానికి కారణమైన వారిని చట్టం వదిలిపెట్టదన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న రిసోర్సు పర్సన్

ఉదయగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సహాయ ఎన్నికల అధికారి కే నెహ్రూబాబు ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈవీఎం మెషీన్లలో బ్యాలెట్ పేపర్ అమరిక, ఈవీ ప్యాడ్ పనితీరు, ఈవీఎం మొరాయిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అభ్యర్థులు ఎక్కువైతే రెండో ఈవీఎం వినియోగం, తదితర అంశాలపై రిసోర్సుపర్సన్లు అవగాహన కల్పించారు.

పాముకాటుతో బాలుడి మృతి



దుత్తలూరు: పాముకాటుతో బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని చింతలగుంటలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన దుగ్గినబోయిన శివరామకృష్ణ(11) రోజూలాగే మంగళవారం రాత్రి ఇంట్లో మంచంపై నిద్రకు ఉపక్రమించాడు. ఆ సమయంలో మంచం పక్కనున్న పాము బాలుడి చేయిపై కాటేసింది. బాలుడ్ని వెంటనే కుటుంబ సభ్యులు దుత్తలూరు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యసిబ్బంది సూచనల మేరకు వింజమూరు సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో చింతలగుంటలో తీవ్రవిషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చింతలగుంటకు చేరుకుని బాలుడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాలుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, నందిపాడు సొసైటీ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, స్థానిక నాయకులు ఉన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



వైకుంఠపురం అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైకుంఠపురం, పుల్లారెడ్డినగర్‌లో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్‌సెంటర్లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తోందని తెలిపారు. అర్బన్ హెల్త్‌సెంటర్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణంతో పాటు ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్యసురక్ష, తదితర కార్యక్రమాల ద్వారా పేదలకు ఇంటి వద్దే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25లక్షలకు పెంచిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ వర్తించని వ్యాధులతో చికిత్స పొందిన బాధితులకు సీఎం సహాయ నిధి ద్వారా నగదు సాయం అందించి ఆదుకుంటోందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ అధికారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- విజయీభవ యాత్రలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



కేన్సర్ బాధితుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

మర్రిపాడు: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందించాం. ఇలాగే మళ్లీ సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆశీర్వదించాలి' అని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. మండలంలోని భీమవరంలో విజయీభవ యాత్రను బుధవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో అందించిన సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరించారు. భీమవరంలో 3,498 మందికి డీబీటీ, నాన్‌డీబీటీ పథకాల ద్వారా రూ.12.86 కోట్ల సంక్షేమ లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా రూ.40 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. రూ.2.4 లక్షలతో బోర్లు, ఎస్‌ఆర్‌జీఎస్ ద్వారా రూ.2.23 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. భీమవరం చెరువు కింద రూ.40 లక్షలతో పంట కాలువల నిర్మాణం చేశామన్నారు. హైలెవల్ కెనాల్ భూముల సర్వే పూర్తి చేశామన్నారు. బొగ్గేరుపై బ్రిడ్జి కాజ్ వే నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. రెవెన్యూ సంస్కరణలతో 346 మంది రైతులకు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. రూ.41.4 లక్షలతో జగనన్న కాలనీ లేఅవుట్ నిర్మించి పేదల సొంతింటి కలను సాకారం చేశామన్నారు. సొంత స్థలం కలిగిన వారికి ఇళ్ల నిర్మాణానికి రూ.9లక్షలు మంజూరు చేశామన్నారు. అనంతరం సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, అంబటి కృష్ణారెడ్డి, మందా రామచంద్రారెడ్డి, బొర్రా వెంకటేశ్వర్లు, గాలిబోయిన లక్ష్మీనరసయ్య, రామ్మోహన్, నూనె హజరత్ యాదవ్, గోపాల్‌రెడ్డి, వెంగల్‌రెడ్డి, మౌలాలి, ఉర్లగంటి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితుడికి రూ.30వేలు ఆర్థిక సాయం

భీమవరానికి చెందిన ఎం పిచ్చయ్య కేన్సర్‌తో బాధపడుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేక వైద్యానికి ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకురాగా స్పందించారు. పిచ్చయ్య ఇంటికి వెళ్లి పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎంపీలు విజయసాయిరెడ్డి, బీద, ఎమ్మెల్యే రామిరెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

కావలి: కావలి నియోజకవర్గానికి చెందిన 68 మంది బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎంపీలు వేణుంబాక విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 68 మంది బాధితులకు రూ.51.79 లక్షల నగదు చెక్కులను అందజేశారు. పార్టీ నాయకులు జంపాని రాఘవులు, శివకుమార్ రెడ్డి, జనిగర్ల మహేంద్ర, తాళ్లూరి ప్రసాద్‌నాయుడు, నీలం సాయి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర వైద్య బృందం పరిశీలన



ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించిన కేంద్ర బృందం

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని కేంద్ర వైద్య బృందం బుధవారం పరిశీలించింది. వైద్యులు నీరజ, సందీప్‌ల నేతృత్వంలో క్షయ నివారణకు సంబంధించి రక్త, గళ్ల పరీక్షల ల్యాబ్‌లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఇన్‌ఫెక్షన్లు సోకకుండా పరిశుభ్రత పాటించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలోనూ ఆస్పత్రి అవార్డు పొందిన విషయాన్ని గుర్తుచేస్తూ మరింత మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు ఆస్పత్రిని పరిశుభ్రతలో తొలి స్థానంలో ఉండేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం, ఆర్‌ఎంఓ ఉషాసుందరి, వైద్యులు బాలాజీ, నరసింహశాస్త్రి, ల్యాబ్ సూపర్‌వైజర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న బీఎస్‌ఎఫ్ దళాలు

సోమశిల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేందుకు ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు అనంతసాగరం ఎస్సై ఎం సూర్య ప్రకాష్‌రెడ్డి తెలిపారు. అనంతసాగరం మండలం శంకరనగరం, రేవూరు, మినగల్లు, అనంతసాగరం గ్రామాల్లో బీఎస్‌ఎఫ్ కేంద్ర బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై మస్తాన్ బాషా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి



ఉదయగిరిలో మొల్ల చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీడీఓ



ఏఎస్‌పేటలో..

ఉదయగిరి: మండల పరిషత్ కార్యాలయంలో ప్రముఖ కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. మొల్ల చిత్రపటానికి ఎంపీడీఓ డీ.ఈశ్వరమ్మ, ఎంపీటీసీ తిరుపతి పూలమాల వేసి నివాళులర్పించారు. మాతృభాష తెలుగులో రామాయణాన్ని రచించి మొల్ల ఎంతో ప్రసిద్ధికెక్కారన్నారు. కవులను, రచయితలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ బీ శ్రీనివాసులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కవయిత్రి మొల్ల చిత్రపటానికి ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయంలో కవయిత్రి మొల్ల చిత్రపటానికి ఎంపీడీఓ వెంకటేశులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఓ సీ శ్రీనివాసులు, దూబగుంట ఎంపీటీసీ వీరయ్య, తదితరులులు పాల్గొన్నారు.